epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 01 | సంచిక : 49 | శుక్రవారం | 07.06.2024




## జనగామ ఠాణాలో

# థర్డ్ డిగ్రీ





- ఇద్దరు స్టూడెంట్లను బట్టలిప్పి మొద్దుకేసిన పోలీసులు
- తీవ్ర గాయాలతో చికిత్సపొందుతున్న బాధిత యువకులు

**జనగామ, మన చౌరాస్తా :**

జనగామ పోలీసులు రెచ్చిపోయారు. ఓ కేసుతో సంబంధంలేని అభం.. శుభం తెలియని ఇద్దరు స్టూడెంట్లను పీఎస్‌కు తీసుకొచ్చి థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న వారు ఆలస్యంగా వెలుగులోకి వచ్చారు. పూర్తి వివరాలు బాధితుల కథనం ప్రకారం.. జనగామకు చెందిన కౌన్సిలర్ దేవరాయ నాగరాజుపై ఇటీవల ఓ ప్లాట్ విక్రయంలో చీటింగ్ కేసు నమోదు చేశారు. సదరు కౌన్సిలర్ తప్పించుకుని తిరుగుతుండడంలో జనగామ పోలీసులు అతడిపై పూర్తి స్థాయిలో నిఘా పెట్టారు. గత మూడు రోజుల కింద ఆయన జనగామకు వచ్చినట్టు గుర్తించి పోలీసులు పట్టుకునేందుకు ఆ కౌన్సిలర్ ఇంటికి వెళ్లారు. విషయం తెలుసుకున్న ఆ కౌన్సిలర్ పోలీసులకు చిక్కకుండా పరారీ అయ్యాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న సదరు కౌన్సిలర్ కుమారుడితో పాటు అతడి సోదరుడు బీజేపీ నేత, మాజీ కౌన్సిలర్ దేవరాయ ఎల్లయ్య కుమారుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కౌన్సిలర్ పారిపోయేందుకు వారే కారమని స్టేషన్‌కు తీసుకొచ్చారు. బట్టలిప్పి విక్షణ రహితంగా చితకబాదారు. కేసు తమకు ఎలాంటి సంబంధం లేదని పోలీసుల కాళ్లు పట్టుకుని ఎంత ప్రాధేయపడినా.. వదలేదని బాధితులు వాపోయారు.

### కులం పేరుతో దుషనలు..

వెనుబడిన సామాజికవర్గానికి చెందిన వారిని పోలీసులు కులం పేరుతో దూషించారని బాధితులు పేర్కొన్నారు. అసలు మా నాన్న తప్పు చేస్తే తమను పట్టుకొచ్చి కొట్టడం ఏమిటని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### డీసీపీకి ఫిర్యాదు..

జనగామ పోలీసులు తమ ఇద్దరు కుమారులను అకారణంగా పోలీస్ స్టేషన్‌లో విచక్షణా రహితంగా కొట్టారని ఆరోపిస్తూ మాజీ కౌన్సిలర్ దేవరాయి ఎల్లయ్య గురువారం డీసీపీ సీతారాంకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తన తమ్ముడు, ప్రస్తుత కౌన్సిలర్ దేవరాయి నాగరాజుపై ఇటీవల ఓ కేసు నమోదైందని తెలిపారు. అప్పటి నుంచి ఆయన పరారీలో ఉండగా.. పోలీసుల నిత్యం ఇంటికి వచ్చి వేధిస్తున్నారని ఎల్లయ్య ఆరోపించారు. మూడు రోజుల కింద తన కుమారుడితో పాటు తమ్ముడి కుమారుడిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి చేతులు, కాళ్లు లేవకుండా విచక్షణా రహితంగా కొట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అకారణంగా దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డీసీపీని కోరారు. ఇదిలా ఉండగా సదరు బాధితులు హెచ్ఆర్సీ వెళ్లేందుకు సిద్ధంగా కాగా పోలీసులు రాజీబేరానికి వచ్చినట్టు వారికి సారీ చెప్పినట్టు తెలిసింది.



గ్రూప్ 1 పరీక్షలకు

## అన్నీ ఏర్పాట్లు

- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా

2



పోటెత్తిన

## అభిమానం..

- ఎంపీ కావ్యకు అభినందనల వెల్లువ

2



కొత్త చట్టాపై

## అవగాహన తప్పనిసరి

- సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారీ

2



# గ్రూప్-1 పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలి

- **వానాకాలం పంటకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలి**
- **రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి**

**జనగామ, మన చౌరాస్తా :** గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణ, వానాకాలం పంట సీజన్ విత్తనాలు, ఎరువుల లభ్యత, మిషన్ భగీరథ త్రాగు నీటి సరఫరాపై జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా నివేదిస్తూ... జూన్ 9వ తేదీన ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్న గ్రూప్ 1 పరీక్షకు 14 కేంద్రాల్లో 3,697 మంది హాజరు కానున్నారని వివరించారు. అనంతరం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ ప్రశ్నా పత్రాలను భద్రపరిచే స్ట్రాంగ్ రూంలను సన్నద్ధం చేయాలని, జిల్లాలకు ముఖ్యమైన సామాగ్రి, ప్రశ్నా పత్రాలు చేరుకుంటున్నందున వాటిని భద్రపరిచేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. పరీక్ష కేంద్రం పరిసరాలలో 144 సెక్షన్ అమలు చేయాలని, పరీక్షా సమయంలో 3 గంటలపాటు జిరాక్స్ సెంటర్లను పూర్తి స్థాయిలో మూసివేయించాలన్నారు. స్ట్రాంగ్ రూం నుంచి పరీక్షా కేంద్రానికి ప్రశ్నా పత్రాలు, తిరిగి పరీక్షా కేంద్రం నుంచి జవాబు పత్రాలు రిసెప్షన్ సెంటర్ కు తరలించడంలో అప్రమత్తంగా వ్యవహరించాలని, స్ట్రాంగ్ రూమ్ నుంచి పోలీస్ బందోబస్తుతో తీసుకొని వెళ్లి పరీక్షా కేంద్రాల్లోని లైజనింగ్ అధికారులకు అందజేయాలని, రిసెప్షన్ సెంటర్ లో టి.జి.పి.ఎస్.సి. అధికారులకు అందజేయాలని ఆదేశించారు.

### విత్తనాలు, ఎరువులు అందుబాటులో..

వానాకాలం పంట సీజన్ ప్రారంభమవు తుందని, రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలు, ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని శాంతికుమారి సూచించారు. వాటి పంపిణీ లో ఎక్కడా ఇబ్బందులు రాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. రాబోయే 20 నుంచి 25 రోజుల వ్యవధిలో చాలా వరకు రైతులు విత్తనాలను కొనుగోలు చేస్తారని, ఈ సమయంలో క్షేత్ర స్థాయిలో సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ నకిలీ విత్తనాలను అరికట్టాలని అన్నారు. రైతులు ప్రభుత్వం గుర్తించిన లైసెన్స్ విత్తన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని, విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతులు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని, సీల్డ్ ప్యాకెట్లను మాత్రమే రైతులు కొనుగోలు చేయాలని, దీనిపై విస్తృతంగా ప్రచారం చేయాలని సీఎస్ అధికారులకు సూచించారు. జిల్లాలో ముందుగా ఎక్కడ వ్యవసాయం ప్రారంభమవుతుందో, ఎక్కడ నాట్లు వేస్తారో ఆ ప్రాంతాలలో ఎరువులు, విత్తనాలు అవసరమైన మేర అందుబాటులో ఉంచాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని అన్నారు. నకిలీ విత్తనాల గురించి సమాచారం అందితే వెంటనే మీడియా ద్వారా రైతులను అప్రమత్తం చేయాలని, నకిలీ విత్తనాలను విక్రయిస్తున్న వారిపై పీడీ యాక్ట్ కింద కేసులను నమోదు చేయాలని సీఎస్ సూచించారు. వేసవికాలంలో ఎటువంటి ఇబ్బంది లేకుండా త్రాగునీటిని విజయవంతంగా సరఫరా చేయడంలో అధికారులు సఫలీకృతులయ్యారని, ఇదే స్పూర్తితో రాబోయే 20 రోజులలో సైతం అప్రమత్తంగా ఉంటూ ప్రతి ఇంటికి తాగునీరు సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. సింగల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని ప్రభుత్వం నిషేధించిందని, దీనిని క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు చేయాలన్నారు. పాఠశాలలు పునఃప్రారంభానికి ముందే ప్రతి విద్యార్థికి రెండు జతల స్కూలు యూనిఫామ్ కుట్టించి అందజేయాలని సీఎస్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీసీపీ సీతారాం, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, జెడ్పీ సీఈవో అనిల్ కుమార్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మొగులప్ప, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ నరసయ్య, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# పోటెత్తిన అభిమానం..

**ఎంపీ కావ్యకు అభినందనల వెల్లువ**

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** 40 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత వరంగల్ ఎంపీగా డాక్టర్ కడియం కావ్య భారీ మెజారిటీతో గెలుపొందడంతో అభిమానులు, పార్టీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు ఆమెను కలిసేందుకు క్యూ కట్టడంతో హనుమకొండలోని ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఇంటి వద్ద పోటెత్తిన అభిమానం, హోరెత్తిన అభినందనలు కొనసాగుతున్నాయి. స్టేషన్ ఘన్ పూర్, చిల్పూర్, జఫర్గడ్, ధర్మసాగర్, వేలేరు, లింగాల గణపురం, రఘునాథపల్లి మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజా ప్రతినిధులు ఎంపీ డాక్టర్ కడియం కావ్యని, స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిసి పుష్పగుచ్చాలు ఇచ్చి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలపడంతో ఎమ్మెల్యే ఇంటి పరిసరాలు పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి.

### భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ

వరంగల్ లోక్ సభ ఎన్నికలలో ఘన విజయం సాధించిన తర్వాత గురువారం మొదటి సారిగా భద్రకాళి అమ్మవారిని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీర్వచనలు అందజేశారు. అనంతరం ఎంపీ డాక్టర్ కడియం కావ్య గారు మాట్లాడుతూ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు ఎల్లప్పుడూ సుఖ సంతోషాలతో ఉండే విధంగా భద్రకాళి అమ్మవారి ఆశీస్సులు ఉండాలని, అలాగే వరంగల్ నగరాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు కావాల్సిన తోడ్పాటును అందించాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు.



# కొత్త చట్టాలపై అవగాహన తప్పనిసరి

- **సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారీ**

**వరంగల్, మన చౌరాస్తా :** జులై 1 నుంచి అమలు కానున్న నూతన చట్టాలపై ప్రతి ఒక్క పోలీసు అధికారికి అవగాహన కలిగి ఉండాలని సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారీ పోలీస్ అధికారులు సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు పోలీస్ అధికారులు సిబ్బందికి నూతన చట్టాలపై అవగాహన కల్పించడంలో భాగంగా విడతల వారిగా శిక్షణ తరగతులను ఏర్పాటు చేశారు. స్థానిక ములుగు రోడ్ లోని ఎల్. బి కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ శిక్షణ తరగతులను సెంట్రల్ జోన్ డీసీపీ ముఖ్యం అతిధిగా హాజరయి శిక్షణ తరగతులను గురువారం ప్రారంభించారు. వరంగల్, హనుమకొండ డివిజన్లకు చెందిన పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్న ఈ కార్యక్రమంలో డీసీపీ



మాట్లాడుతూ జూలై 1వ తేది నుండి దేశవ్యాప్తంగా కొత్త చట్టాలను అమలు చేస్తూ భారత ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, అందుకు అనుగుణంగా జూలై 1వ తేది నుండి కొత్త చట్టాలను అనుసరిస్తూ ముందుకు సాగాల్సి ఉంటుందన్నారు. కొత్త చట్టాల గురించి ప్రతి ఒక్క అధికారి, సిబ్బందికి పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఇందులో భాగంగా జిల్లా పోలీసులందరికీ విడతలవారీగా శిక్షణ తరగతులను నిర్వహించడం జరుగుతుందన్నారు. కొత్త చట్టాలైన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత మరియు భారతీయ సాక్ష్యా అధినియం 2023 చట్టాలపై పై పూర్తి అవగాహన కలిగి ఉన్నపుడే సమర్ధవంతంగా విధులు నిర్వహించగలం అని, కొత్త చట్టాలపై అవగాహణ రావాలంటే నేర్చుకోవాలనే తపన మనలో ఉన్నప్పుడే సాధ్యం అవుతుందని డీసీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు నందిరామ్ నాయక్, దేవేందర్ రెడ్డి, ఇన్స్ స్పెక్టర్లు గోపి, శివకుమార్, మల్లయ్య, సంజీవ్, సత్యనారాయణ రెడ్డి, సుధాకర్ రెడ్డి తో పాటు ఎస్. ఐలు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

Local News

# రెండు రైళ్లలో చోరీ

## విచారణ చేపట్టిన పోలీసులు



**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** బుధవారం అర్ధరాత్రి పలు రైళ్లలో దొంగలు దోపిడికి పాల్పడగా ఇటు సివిల్, అటు రైల్వే పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. వివరాల్లోకి వెళితే... జనగామ జిల్లా స్టేషన్ ఘన్ పూర్‌చిల్పూర్ మండలాల పరిధిలో బుధవారం రాత్రి చిన్నపెండ్యాల, నష్కల్ రైల్వే స్టేషన్ సమీపంలో నర్సాపూర్, నాగర్సోల్ ఎక్స్ ప్రెస్ రైలును ఆపి దోపిడి దొంగలు మహిళల నుంచి సుమారు 30 తులాల బంగారం గొలుసులు, మంగళ సూత్రాలను, నగదును దోచుకెళ్లారు. కాజీపేట రైల్వే స్టేషన్ లో ప్రయాణికులు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ కు ఫిర్యాదు చేయగా సివిల్ పోలీసులతో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించిన స్టేషన్ ఘనపూర్ ఏసీపీ భీమ్ శర్మ, రైల్వే జీఆర్పీ పోలీసులు గురువారం విచారణ చేపట్టారు.

# విద్య హక్కు చట్టాన్ని అమలు చేయాలి

## ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం




**జనగామ, మన చౌరాస్తా :** 2009 విద్య హక్కు చట్టం ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ప్రైవేటు స్కూళ్లలో 25 శాతం ఉచిత విద్యని అందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలో ఫీజుల దోపిడీని అరికట్టాలని, ఫీజులు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని అధికారులను కోరారు. జిల్లాలో అనుమతులు లేకుండా కొన్ని ప్రైవేట్ పాఠశాలలు ముందస్తు అడ్మిషన్లు చేస్తూ అడ్మిషన్ చేయడమే కాకుండా రిజిస్ట్రేషన్ ఫీజులు సైతం భారీ మొత్తంలో వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ సంవత్సరం పూర్తి చేసిన పదో తరగతి విద్యార్థుల దగ్గర నుంచి స్టడీస్ సర్టిఫికెట్ టీసీ పేరుతో పెద్ద మొత్తంలో వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య హక్కు చట్టాన్ని అమలు చేయని, పాఠశాలపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు దాసగానీ సుమ, జిల్లా సహాయ కార్యదర్శి యాకన్న రాథోడ్, నాయకులు సంజయ్ రెడ్డి పాల్గొన్నారు.

www.manachourasta.com
మన చౌరాస్తా
The Complete News way


'మన చౌరాస్తా' తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తి స్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'మన చౌరాస్తా' సాదర స్వాగతం పలుకుతోంది.
సెల్ : 9676400812



# జవాలిన్ త్రోలో... మనుదీప్‌కు తృతీయ స్థానం

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** జనగామ జిల్లా స్టేషన్ ఘన్ పూర్ మండలం తాటికొండ కు చెందిన మారపాక మనుదీప్ జావలిన్ త్రోలో రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానం సాధించాడు. హనుమకొండ జేఎన్ఎం స్టేడియంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో మనుదీప్ ప్రతిభను కనబరిచి జవాలిన్ త్రో లో తృతీయ స్థానం సాధించాడు.




# విద్యార్థుల నమోదు పెంచాలి

## సెక్టోరియల్ అధికారి నర్సింహ రావు

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** బడిబాట కార్యక్రమంతో విద్యార్థుల నమోదును పెంచాలని సెక్టోరియల్ అధికారి నరసింహారావు పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ జయ శంకర్ బడి బాట కార్యక్రమాన్ని మండలంలోని స్టేషన్ ఘన్ పూర్ మండలంలో గురువారం ప్రారంభించారు. మండల విద్యాశాఖ నోడల్ అధికారి కొమురయ్య ఆధ్వర్యంలో ఛాగల్ ఉన్నత పాఠశాలలో బడిబాటను నరసింహారావు ప్రారంభించారు. ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్య నాణ్యత, సౌకర్యాలను వివరించి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. స్వచ్ఛంద సంస్థల సహకారం తో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ స్పెషల్ అధికారి విజయ్ కుమార్, ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షులు, సభ్యులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, పంచాయతీ సెక్రెటరీ, కారోబార్, వివోఏలు, సిఅర్ పి లవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ఎంపి, పిఎంపీలపై దాడులు అరికట్టాలి

స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా : ఆర్ఎంపి, పిఎంపీలపై దాడులు అరికట్టాలి, ఆర్ఎంపి పిఎంపీలకు పీహెచ్ సీలలో అవకాశం అవకాశం కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ఆర్ఎంపి, పిఎంపీల వెల్ఫేర్ జనగామ జిల్లా కార్యదర్శి డాక్టర్ వేముల వెంకటేశ్వర్లు కోరారు. ఆర్ఎంపి, పిఎంపీలకు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా కేంద్రంలో ఆర్ఎంపీల బతుకు భరోసా ర్యాలీ, కలెక్టర్ కార్యాలయం ముందు దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు పసునూరి సత్యనారాయణ అధ్యక్షత వహించగా రాష్ట్రప్రధాన కార్యదర్శి బి బాలరాజు, ఉపాధ్య క్షుడు వెంకటాచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి మంతెన రమేష్, సహాయ కార్యదర్శి వేముల వెంకటేశ్వర్లు, కోశాధికారి ఆలే సురేందర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రామకృష్ణ, జనగామ పట్టణ అధ్య క్షుడు చిదిరాల రాజు, చిల్పూర్ మండల అధ్యక్షుడు పేరాల చంద్రమౌళి, స్టేషన్ ఘనపూర్ మండల అధ్యక్షుడు బుయ్య గట్టయ్య , 12 మండలాల అధ్యక్ష కార్యద ర్శులు తదితరులు పాల్గొన్నారు.



# కెమెరా ఉంటే చాలు.. రెడీ అంట..

మన చౌరాస్తా, సినిమా : సాధారణంగా సోషల్ మీడియాలో సెలబ్రెటీలు చాలా చురుగ్గా ఉంటారన్న సంగతి తెలిసిందే. నిత్యం తమ సినిమా అప్డేట్స్, లేదా క్రేజీ ఫోటోషూట్స్, డాన్స్ వీడియోస్ షేర్ చేస్తుంటారు. కానీ ఈ మధ్య మాత్రం ఎక్కువగా తమ త్రోబ్యాక్ ఫోటోస్ షేర్ చేస్తున్నారు పలువురు హీరోయిన్స్. చిన్నప్పటి ఫోటోస్ షేర్ చేస్తూ అభిమానులతో టచ్ లో ఉంటున్నారు. కానీ ఇప్పుడు ఓ హీరోయిన్ మాత్రం తన ఇన్ స్టాలో కొన్ని త్రోబ్యాక్ ఫోటోస్ షేర్ చేసింది. కెమెరా ఉంటే చాలు ఫోటో దిగేందుకు రెడీగా ఉంటా అంటూ క్యాప్షన్ కూడా ఇచ్చింది. పైన ఫోటోను చూశారు కదా.. ముసుగు మాటున దాగిన అందాల ముద్దుగుమ్మ ఎవరో గుర్తుపట్టారా.. ? టాలీవుడ్ మోస్ట్ వాంటెడ్ హీరోయిన్. ఫస్ట్ మూవీ నుంచి ఇప్పటి వరకు వరుసగా హిట్స్ అందుకుంటూ తెలుగు ప్రేక్షకులకు దగ్గరవుతుంది. అంతేకాదు.. మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ ప్రశంసలు కూడా అందుకుంది. ఇంతకీ ఆ బ్యూటీ ఎవరో గుర్తుపట్టారా..? ఇటీవలే సూపర్ హిట్ చిత్రాలతో టాలీవుడ్ ఇండస్ట్రీలో తనకంటూ ఓ ఫ్యాన్ బేస్ క్రియేట్ చేసుకుంది. ఆమె ఎవరో కాదు.. హీరోయిన్ మీనాక్షి చౌదరి.

ఇటీవల తెలుగు సినీ పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు పొందిన తారలలో మీనాక్షి ఒకరు. ట్రెడిషనల్, వెస్ట్రన్ ఇలా లుక్ ఏదైనా కుర్రాళ్ల హృదయాలను కట్టిపడేస్తుంది. సినిమాల కన్నా సోషల్ మీడియాలో తన గ్లామర్ ఫోటోలతో ఎక్కువగా అభిమానులను సంపాదించుకుంటుంది. మీనాక్షి చౌదరి.. నటనపై ఆసక్తితో సినీరంగంలోకి అడుగుపెట్టింది. మిస్ ఇండియా హర్యానా టైటిల్ గెలుచుకున్న ఈ బ్యూటీ.. మోడల్ గా మంచి గుర్తింపు తెచ్చుకుంది. 2019లో అప్ స్టార్ట్స్ అనే హిందీ సినిమాతో బాలీవుడ్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. కానీ ఆశించిన స్థాయిలో అక్కడ గుర్తింపు తెచ్చుకోలేకపోయింది. ఆ తర్వాత సుశాంత్ నటించిన 'ఇచ్చట వాహనములు నిలుపరాదు' సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. మొదటి సినిమాతోనే అందం, అభినయంతో స్పెషల్ అట్రాక్షన్ అయ్యింది. ఈ సినిమా తర్వాత చాలా కాలం సైలెంట్ అయిన ఈ బ్యూటీ.. మాస్ మాహారాజా రవితేజ నటించిన 'ఖిలాడీ' చిత్రంలో నటించింది. అలాగే అడివి శేష్ నటించిన 'హిట్ 2' మూవీతో సక్సెస్ అందుకుంది. ఈ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరైంది. ఇటీవలే సూపర్ స్టార్ మహేష్ బాబు, త్రివిక్రమ్ కాంబోలో వచ్చిన గుంటూరు కారం సినిమాలో కనిపించింది. ఇందులో మహేష్ మరదలు పాత్రలో కనిపించి మరోసారి ఆకట్టుకుంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో క్రేజీ ఫోటోస్ షేర్ చేస్తూ హల్చల్ చేస్తుంది.